క్లుప్తంగా

రెగ్యులర్ కమిషనర్‌ను నియమించండి

సాలూరు: సాలూరు మున్సిపాలిటీకి రెగ్యులర్ కమిషనర్‌ను నియమించి ప్రజా సమస్యలను పరిష్కరించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎన్‌వైనాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం పట్టణంలో ఆయన మాట్లాడుతూ, మున్సిపాలిటీ పరిధిలో సులభ్ కాంప్లెక్స్‌ల నిర్వహణ, రైతు బజారును వినియోగంలోకి తీసుకురాకపోవడం, పెట్రోల్, డీజిల్ బిల్లుల చెల్లింపులు పూర్తిగా ఇవ్వక మున్సిపాలిటీలో పారిశుధ్య పనుల సమస్యలు తదితర అనేక ఇబ్బందులు ప్రజలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, స్త్రీ శిశు సంక్షేమ,గిరిజన సంక్షేమశాఖామంత్రి సంధ్యారాణిలు స్పందించి రెగ్యులర్ కమిషనర్‌ను నియమించాలని కోరారు.

27వ వార్డులో గ్యాంగ్ వర్క్స్



పట్టణంలో గ్యాంగ్ వర్క్స్‌లో పాల్గొన్న కమిషనర్ శ్రీనివాస్

పార్వతీపురంటౌన్: పట్టణంలోని 27వ వార్డులో గురువారం గ్యాంగ్ వర్క్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ మాట్లాడుతూ 15 సచివాలయాలను మూడు యూనిట్లుగా విడదీసి 30 వార్డుల పరిధిలో ప్రతి రోజు మధ్యాహ్నం మూడు సచివాలయ వార్డుల్లో శానిటేషన్ వర్కర్లతో గ్యాంగ్‌వర్క్స్‌ను ప్రారంభించామని చెప్పారు. పారిశుధ్య పనులు, యాంటీ లార్వా స్ప్రేయింగ్, గార్బేజ్ రిమూవల్ తదితర పనులను నిర్వహించామన్నారు. కార్యక్రమంలో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్, శానిటేషన్, ఎమినిటి, ప్లానింగ్ సెక్రటరీలు, మేస్త్రీలు పాల్గొన్నారు.

గుణాత్మక బోధన అవసరం

- ఉప విద్యాశాఖాధికారి కృష్ణమూర్తి



శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న ఎంఈఓ సోంబాబు

పాలకొండ రూరల్: విద్యార్థులపై ఎటువంటి మానసిక ఒత్తిడి పడకుండా గుణాత్మక బోధన అందించాలని ఉప విద్యాశాఖాధికారి పి. కృష్ణమూర్తి అన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో టీచ్ టూల్ పేరిట తొమ్మిది రోజులు నిర్వహించనున్న ప్రత్యేక శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాటాడ్లడుతూ, విద్యార్థుల అభ్యసనా స్థాయిని అంచనా వేసి బోధన చేపట్టినప్పుడే ఉపాధ్యాయుడి వృత్తి నైపుణ్యం వెలుగులోకి వస్తుందన్నారు. తరగతి గదిలో గుణాత్మక విద్య అందించడంతో పాటు లక్ష్యాలను అనుగుణంగా బోధించేందుకు టీచ్ టూల్ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. ఎంఈఓ కె. సోంబాబు మాట్లాడుతూ, సమగ్రశిక్ష , రాష్ట్ర విద్యా పరిశోధన మండలి సంయుక్తంగా ఈ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నాయని చెప్పారు.

ఆరోగ్యంపై అవగాహన కల్పించాలి

- ఎంపీడీఓ రామకృష్ణ



తంపటాపల్లి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఆరోగ్య సూచనలు చేస్తున్న అధికారులు

పాలకొండ రూరల్: పారిశుధ్య పక్షోత్సవాల్లో భాగంగా గ్రామాల్లో పర్యటిస్తున్న అధికారులు ఆరోగ్యంపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీడీఓ ఎస్.రామకృష్ణ అన్నారు. మండలంలోని తుంపటాపల్లిలో ఎంపీడీఓ గురువారం పర్యటించి, పారిశుధ్య పనులపై ఆరా తీశారు. అనంతరం ప్రజలతో మమేకమై సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వైద్యాధికారి కమల్‌నాథ్ మాట్లాడుతూ, వర్షాలు పడుతున్నందున ప్రతి ఒక్కరూ వేడి ఆహార పదార్థాలు తినాలని సూచించారు. అలాగే కాచి చల్లార్చిన నీటినే తాగాలన్నారు. అనంతరం స్థానిక ప్రభుత్వ పాఠశాలను సందర్శించి, ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై విద్యార్థులకు వివరించారు.

నవధాన్యాలతో భూమికి సారం

జియ్యమ్మవలస: నవధాన్యాల సాగుతో భూసారం పెరుగుతుందని ఎన్‌ఎఫ్‌ఏ జి. అన్నపూర్ణ అన్నారు. మండలంలోని పరజపాడు గ్రామంలో రైతు ఎం. అచ్యుత సాగుచేస్తున్న నవధాన్యాల సాగును గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా 5/5 విస్తీర్ణంలో పంట కోత ప్రయోగం చేపట్టగా 30 కేజీల 950 గ్రాముల దిగుబడి వచ్చింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఎకరాకు ఐదు టన్నుల పచ్చిరొట్ట ఎరువు వచ్చే అవకాశం ఉందన్నారు. ప్రకృతి వ్యవసాయంలో భాగంగా 20 నుంచి 30 రకాల విత్తనాలైన నవధాన్యాలను సాగుచేసి 40 రోజుల్లో కలియదున్నాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది స్వామినాయుడు, బి. ధనుంజయరావు, జి. త్రినాథ, రైతులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధారణ.. ప్రాణానికి రక్షణ



హెల్మెట్ ధారణ ఆవశ్యకతపై పట్టణంలో నిర్వహిస్తున్న ర్యాలీ

సాలూరు:

ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించి ప్రాణాలను రక్షించుకోవాలని సాలూరు జూనియర్ సివిల్ జడ్జి, మండల లీగల్ సర్వీసెస్ కమిటి చైర్మన్ కె.రమేష్ హితవు పలికారు. హైకోర్టు ఆదేశాల మేరకు పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన రహదారి ప్రమాద నివారణ వారోత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా హెల్మెట్ ధారణ అవసరాన్ని తెలియచేస్తూ తహసీల్దార్ కార్యాలయం కూడలి నుంచి కోర్టు వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, హెల్మెట్ ధరించి ఉన్నట్లయితే, వాహనం నడిపేటప్పుడు ఏదైనా ప్రమాదం సంభవించినా ప్రాణహాని జరిగే పరిస్థితి అంతగా ఎక్కువగా ఉండదని తెలిపారు.హెల్మెట్ ధారణ ఆవశ్యకతను వివరించారు. పట్టణ సీఐ వాసునాయుడు మాట్లాడుతూ హెల్మెట్ లేకుండా ద్విచక్రవాహనాలను నడిపితే జరిమానా విధించడంతో పాటు, డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేసే అవకాశం ఉందని తెలిపారు.నూతన మోటార్ వెహికల్ చట్టాలను వివరించారు. కార్యక్రమంలో న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు తిరుపతిరావు, పోలీసులు, న్యాయవాదులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న జిల్లా రెండవ అదనపు జడ్జి, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ ఎస్.దామోదరరావు

ద్విచక్ర వాహనచోదకుడు హెల్మెట్ ధరించాలి

పార్వతీపురంటౌన్: ద్విచక్ర వాహన చోదకులు తప్పకుండా హెల్మెట్ వాడాలని, కార్లు ఇతర వాహనాలు నడిపే వారు సీటు బెల్టు ధరించాలని, ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటించాలని జిల్లా రెండవ అదనపు జడ్జి, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ ఎస్. దామోదరరావు తెలిపారు. ఈ మేరకు గురువారం స్థానిక జూనియర్ కళాశాల నుంచి ప్రారంభించిన వన్-కె-వాక్ చైతన్య ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో హెల్మెట్ వినియోగం దాని ఆవశ్యకత, ప్రయోజనాలను తెలుపుతూ వన్-కె-వాక్ చైతన్య ర్యాలీ చేపట్టినట్లు తెలిపారు. హెల్మెట్ లేని డ్రైవింగ్ చాలా ప్రమాదకరమని, అందరూ తప్పకుండా వినియోగించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఫస్ట్ క్లాస్ అడిషనల్ జుడిషియల్ మేజిస్ట్రేట్ జె.సౌమ్యజాస్మిన్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జె.రామారావు, విద్యార్థినులు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగ ప్రభుత్వ భవనాలను సద్వినియోగం చేసుకోవాలి

- కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్



బర్లి గ్రామంలో పర్యవేక్షించిన కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

బలిజిపేట: నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ భవనాలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు పారిశుధ్య పక్షోత్సవాలలో భాగంగా బలిజిపేట మండలంలోని బర్లి గ్రామాన్ని ఆయన గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా అధికారులు, గ్రామస్తులతో మాట్లాడుతూ గ్రామస్థాయిలో నిరుపయోగంగా ఉండే ప్రభుత్వ భవనాలను సద్వినియోగం చేసుకోవాలని, గ్రామంలో గ్రంథాలయం ఏర్పాటుచేయాలని దానివల్ల విద్యార్థులు, నిరుద్యోగ యువతీ, యువకులకు ఎంతో మేలు జరుగుతుందని చెప్పారు. అందుకు అవసరమైన ఫర్నిచర్, పుస్తకాలు సరఫరా చేయనున్నామని తెలిపారు. గ్రామంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడాలని సూచించారు. పారిశుధ్య పనుల్లో జాప్యం లేకుండా నిర్వహించాలని స్పష్టం చేశారు. గ్రామంలో చెరువులను అమృత్ సరోవర్ పథకం కింద బాగుచేసుకోవాలని, బాల్యవివాహాలు నివారించాలని సూచించారు. గర్భిణులకు పౌష్టికాహారం లోపం లేకుండా అందించాలని కోరారు. గ్రామంలో ఎక్కడా స్థలాలను ఆక్రమించి ఇష్టానుసారం నిర్మాణాలు జరపరాదని హెచ్చరించారు. అధికారులు అప్రమత్తంగా ఉండి ప్రజలకు ఎటువంటి సమస్యలు లేకుండా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రమేష్‌నాయుడు, సర్పంచ్ అప్పలనాయుడు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థి జ్ఞాపకార్థం సేవా కార్యక్రమాలు



మొక్కలు నాటుతున్న హెచ్‌ఎం శంకరావు, విద్యార్థినులు

సీతానగరం: మండలంలోని గాదెలవలస ఉన్నత పాఠశాల పూర్వవిద్యార్థిని ఆవాల శ్రావణి జ్ఞాపకార్థం విద్యార్థులు సేవా కార్య క్రమాలు చేపట్టడం అభినందనీయమని ప్రధానోపాధ్యాయుడు ఎం.శంకరరావు అన్నారు. ఈ మేరకు గాదెలవలస ఉన్నత పాఠశాల టెన్త్ విద్యార్థులు సమకూర్చిన వంద మొక్కలను నాటే కార్యక్రమం, అన్నసంతర్పణ కార్యక్రమాన్ని గురువారం పాఠశాలలో ప్రారంభించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం శంకరరావు మాట్లాడుతూ గాదెలవలస ఉన్నత పాఠశాలలో చదుతున్న ఆవాల శ్రావణి నిత్యం స్వగ్రామం నుంచి గాదెలవలస ఉన్నత పాఠశాలకు రావడం సాయంత్రం ఇక్కడినుంచి స్వగ్రామానికి చేరుకునేదన్నారు. ఈ క్రమంలో 2023 జూలై నెలలో ఇదే రోజు సాయంత్రం సైకిల్‌తో వెళ్తుండగా ప్రమాదవశాత్తు రోడ్డును ఆనుకుని ఉన్న బురద గోతిలో పడి మృతిచెందిన శ్రావణి భౌతికంగా లేకపోయినప్పటికీ ఆమె జ్ఞాపకార్థం ఉన్నత పాఠశాలలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారని తెలిపారు. అలాగే గ్రామంలో విద్యార్థినులతో శాంతిర్యాలీ నిర్వహించి పేదలకు అన్నసంతర్పణ కార్యక్రమం చేపట్టారని తెలియజేశారు. పాఠశాలల్లో ఇంటువంటి సేవా కార్యక్రమాలు చేపట్టడం వల్ల విద్యార్థుల్లో ఐక్యత పెరుగుతుందని, విద్యపట్ల ఏకాగ్రత, పర్యావరణ పరిరక్షణకు దోహద పడుతుందని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, గ్రామ పెద్దలు, పాఠశాల అభివృద్ధి కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

అందరికీ అందుబాటులో నిత్యావసర సరుకులు

- ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర



నిత్యావసర సరుకుల డిపోను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర

సీతానగరం: రాష్ట్రప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన ఇచ్చిన హామీలన్నీ దశలవారీగా అమలు చేయడానికి సిద్ధంగా ఉందని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. ఈ మేరకు ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమంలో భాగంగా గురువారం సీతానగరం మార్కెట్‌లో రెండు రకాల సన్నబియ్యం , సాధారణ బియ్యం, కందిపప్పు విక్రయకేంద్రాన్ని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహిరంగ మార్కెట్‌లో రూ 55.46 లున్న సన్నబియ్యం కేజీ బియ్యం రూ.49కు విక్రయించనున్నారని, అలాగే కేజీ రూ.52.40కు విక్రయిస్తున్న సాధారణ బియ్యం కేజీ రూ.48కు, కందిపప్పు బహిరంగ మార్కెట్‌లో రూ.180కు విక్రయిస్తుండగా డిపోలో రూ.160కి విక్రయిస్తారని తెలిపారు. అందరికీ నిత్యావసర సరుకులు అందుబాటులో ఉండే విధంగా మండల కేంద్రాల్లోని మార్కెట్లలో నిత్యావసర సరుకుల విక్రయ(డిపో)కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటుచేసిందని చెప్పారు. ప్రజలు నిత్యావసర సరుకుల డిపోలను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీఓ ఎం.ఈశ్వరరావు, సీఎస్‌డీటీ రమేష్‌బాబు, ఉమామహేశ్వరరావు, ఆర్‌ఐ ఎస్.శ్రీనివాసరావు, జెడ్పీటీసీ ఎం.బాబ్జీ, పలుగ్రామాల సర్పంచ్‌లు, టీడీపీ మండల అధ్యక్ష కార్యదర్శులు పెంట సత్యం, రౌతు వేణు నాయుడు, హరిగోపాలరావు, భానుప్రసాద్, స్థానిక సర్పంచ్ జె.తేరేజమ్మ, ఉపసర్పంచ్ అరవింద్‌కుమార్, ఎస్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మండల పరిషత్‌లో సమీక్ష..

మండలంలోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారులు కాలయాపన చేయకుండా పరిష్కరించాలని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అధికారులను ఆదేశించారు. గురువారం ఇక్కడికి వచ్చిన ఆయన మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రజలనుంచి వచ్చిన వినతులపై శాఖలవారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అధికారులు ప్రజల సమస్యలపట్ల అప్రమత్తంగా ఉండాలని, తక్షణమే స్పందించి సమస్యలు పరిష్కరించడానికి సమాయత్తం కావాలని కోరారు. ప్రభుత్వంఅమలు చేస్తున్న పారిశుధ్య పక్షోత్సవాలను ప్రజల భాగస్వా మ్యంతో విజయవంతం చేయాలని సూచించారు. గ్రామాల్లో సీజనల్‌గా వచ్చే వ్యాధుల నివారణకు ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ పావని, సీహెచ్‌ఓ ఎస్‌వీ రమణ, ఎస్సై ఎం.రాజేష్, ఎంఈఓ జి.సూరిదేముడు, ఉపాధిహామీ, వెలుగు, ఇంజినీరింగ్ అధికారులు, వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

బాకీ అడిగినందుకు వ్యక్తిపై దాడి



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కింతలి వైకుంఠరావు

పార్వతీపురంటౌన్: తనకు చెల్లించాల్సిన బాకీ అడిగినందుకు పట్టణంలోని రాయగడ రోడ్డు మెయిన్ రోడ్డులో నివాసం ఉంటున్న కిరాణా వ్యాపారి కింతలి వైకుంఠరావుపై దాడి చేసి గాయపరిచారు. ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. వైకుంఠరావు కన్యకా పరమేశ్వరి ఆలయంలో వివాహ కార్యక్రమాలకు సప్లయర్స్, లైటింగ్ కాంట్రాక్ట్ 2024 జనవరి నుంచి 2 సంవత్సరాలు లీజుకు తీసుకున్నాడు. గరుగుబిల్లి మండలం గొట్టివలస గ్రామానికి చెందిన వారణాసి గురునాథం తన కుమారుడి పెళ్లికి మార్చి నెల 16వ తేదీకి సంబంధించి లైటింగ్, సప్లయర్స్ రూ.55వేలకు అద్దెకు తీసుకుని అడ్వాన్స్ కింద రూ.2వేలు ఇచ్చాడు. పెళ్లయి నాలుగు నెలలైందని బాకీ చెల్లించాలని వైకుంఠరావు ఎన్నిసార్లు అడిగినా గురునాథం ఇవ్వలేదు. ఈ విషయాన్ని కన్యకాపరమేశ్వరి దేవస్థానం కమిటీకి వైకుంఠరావు తెలపడంతో కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు బరాటం వెంకటరమణ మూర్తి, కెంగువ రాజు దేవస్థానం కార్యాలయంలో ఇద్దరినీ సమావేశ పర్చారు. ఆ సమయంలో ఇద్దరూ గొడవ పడడంతో ఆలయ పెద్దలు గమనించి వైకుంఠరావు, గురునాథాలను కార్యాలయం గది లోపల ఉంచి తలుపులు వేశారు. ఈ క్రమంలో గురునాథంతో వచ్చిన వ్యక్తులు గది తలుపులు కాళ్లతో తన్ని విరగ్గొట్టి లోపలికి వచ్చి వైకుంఠరావుపై చేతితో పిడిగుద్దులు గుద్ది తీవ్రంగా గాయపరిచారు. ఈ సంఘటనలో వైకుంఠరావుకు కడుపుకు దెబ్బలు తగిలి తీవ్రమైన నొప్పి కలగడంతో పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందిస్తున్నారు.

రైతుభరోసా తక్షణమే అందించాలి



పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

మక్కువ: ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం రైతుభరోసా పథకం ద్వారా రైతులకు రూ.20వేలు చెల్లిస్తామని హామీ ఇచ్చి, వ్యవసాయ పనులు ప్రారంభమై రెండునెలలు గడుస్తున్నా, ఇంతవరకు రైతుభరోసా అందజేయలేదని రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బంటుదాసు, వ్యవసాయకార్మికసంఘం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు విమర్శించారు. ఈ మేరకు మక్కువ మండలంలోని తూరుమామిడి గ్రామ సచివాలయంలో పంచాయతీ కార్యదర్శికి గురువారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు వ్యవసాయం సాగుకు పెట్టుబడులు పెట్టలేక అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం స్పందించి రైతుభరోసా సత్వరమే అందించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే పెండింగ్ ఉన్న ఉపాధిహామీపథకం బిల్లులు వేతనదారులకు చెల్లించాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ మోటార్లకు, స్మార్ట్‌మీటర్లు ఏర్పాటుచేసేందుకు కూటమి ప్రభుత్వం సన్నాహాలు చేస్తోందని, ఆ నిర్ణయం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతు సమస్యలు పరిష్కరించకపోతే, రైతులతో కలిసి ప్రభుత్వంపై పోరాటానికి దిగుతామని హెచ్చరించారు.


పారిశుధ్యంపై అవగాహన అవసరం



శివరాంపురంలో పారిశుధ్యంపై అవగాహన ర్యాలీలో పాల్గొన్న సర్పంచ్ జరజాపు మోహన్

సాలూరు రూరల్: పారిశుధ్యంపై ప్రజలందరికీ అవగాహన అవసరమని శివరాంపురం సర్పంచ్ జరజాపు మోహన్ పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం గ్రామంలో నిర్వహించిన పారిశుధ్య వారోత్సవాలలో భాగంగా వీఆర్వో ధనలక్ష్మి ఆధ్వర్యంలో అంగన్వాడీ కార్యకర్తలు, ఆశవర్కర్లు, సచివాలయ సిబ్బంది పారిశుధ్యంపై తీసుకోవాలిన్సిన జాగ్రత్తలను వివరిస్తూ ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది జయప్రకాశ్, నూకరాజు, కమలకుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు జరజాపు పార్వతి, పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

పట్టణ సమస్యలు పరిష్కరించాలి



మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎన్‌హెచ్‌ఆర్‌పీ ఫోరం సభ్యులు

పార్వతీపురంటౌన్: పార్వతీపురం పట్టణ సమస్యలు పరిష్కరించాలని జాతీయ మానవ హక్కుల పరిరక్షణ సంస్థ సభ్యుడు వల్లిరెడ్డి జగదీష్ కోరారు. ఈ మేరకు గురువారం ఆయన మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టణంలో తాగునీటి సమస్య, డ్రైనేజీ, వర్షపు నీరు మళ్లింపు వంటి సమస్యలతో ప్రజలు ఇబ్బందులు నడుతున్నారని తక్షణమే సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా దోమల సమస్య పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఎన్‌హెచ్‌ఆర్‌పీ ఫోరం సభ్యులు పాల్గొన్నారు.

ఆర్‌డీఓ విచారణ

సాలూరు: అంగన్వాడీ యూనియన్ నాయకురాలు బలగ రాధపై ఆర్‌డీఓ హేమలత విచారణ చేపట్టారు. ఈ మేరకు గురువారం ఆమె తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి ఐసీడీఎస్ పీఓ, సూపర్‌వైజర్లు, అంగన్వాడీ కార్యకర్తలు తదితరులతో మాట్లాడారు. విచారణ నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని ఆర్‌డీఓ ఈ సందర్భంగా తెలిపారు.

శివ్వాం దళితులకు ప్రభుత్వం న్యాయం చేయాలి



కలెక్టరేట్ వద్ద రిలే నిరాహార దీక్ష

- ఆశ వర్కర్స్ యూనియన్

పార్వతీపురంటౌన్: మండలంలోని శివ్వాం గ్రామ దళితులకు ప్రభుత్వం న్యాయం చేయాలని, పేదలు గిరిజనుల భూ సమస్యల పరిష్కరించాలని కలెక్టరేట్ వద్ద చేపట్టిన నిరాహార దీక్షకు జిల్లా ఆశ వర్కర్స్ యూనియన్ మద్దతు ప్రకటించింది. ఈ మేరకు గురువారం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహ కార్యదర్శి మరి శ్రీను, పి. చిన్నయ్య, ఆర్.జ్యోతి, పాలక కళావతి, ఆర్.అప్పమ్మ, రేగిడి అప్పలస్వామి, గిరిజన సంఘం మండల కార్యదర్శి హిమరిక బలరాం 4వ రోజు దీక్షలో కూర్చున్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి, అధ్యక్షురాలు ఎం.శివాని, కె. గౌరీశ్వరి, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు వి.ఇందిర, సంఘం నాయకురాలు కె. బృందావతి, రజిని, అప్పలనరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్ బకాయి వేతనాలు చెల్లించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మన్మథ రావు

పార్వతీపురంటౌన్: కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్ బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మన్మథరావు కోరారు. ఈ మేరకు గురువారం పార్వతీపురంలోని సీఐటీయూ ఆఫీసులో కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశ వర్కర్లు, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. కార్మిక హక్కులు కాపాడే విధంగా ప్రభుత్వం కార్మిక కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో యూనియన్ గౌరవ అధ్యక్షురాలు వి.ఇందిర, ఏపీ ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కె.గౌరీశ్వరి, కార్యదర్శి ఎం.శివాని, జిల్లా కమిటీ సభ్యులు, కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్ నాయకురాలు కె. బృందావతి, బి అప్పలనరసమ్మ, రజని, రంభ, శంబాన జ్యోతి పాల్గొన్నారు.

ప్రజల భాగస్వామ్యంతోనే పారిశుధ్య పనులు



అంటిపేటలో మాట్లాడుతున్న డీటీ చిట్టెమ్మ

సీతానగరం: ప్రభుత్వం ప్రతిష్టాకరంగా అమలు చేస్తున్న పారిశుధ్య పక్షోత్సవాల్లో ప్రజలను భాగస్వామ్యం చేయడంతో విజయవంతం అవుతాయని రీసర్వే డీటీ పి.చిట్టెమ్మ అన్నారు. ఈ మేరకు గురువారం ఆమె పారిశుధ్య పక్షోత్సవ కార్యక్రమంలో భాగంగా అంటిపేటలో సర్పంచ్ బి.తిరుపతిరావు అధ్యక్షతన అవగాహన సదస్సు, పారిశుధ్య పనులు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల నివారణకు ముందు జాగ్రత్త చర్యలుగా సామూహికంగా పారిశుధ్యపనులు నిర్వహించాలని మార్గదర్శకాలు వచ్చాయన్నారు. ఈ మేరకు గ్రామాల్లో పారిశుధ్య పనులు సర్పంచ్‌ల పర్యవేక్షణలో జరుగుతున్నాయని అందులో ప్రజలను భాగస్వాములను చేయడం వల్ల వారికీ బాధ్యత కలుగుతుందని, ఇళ్లలోని చెత్తను వీధుల్లో వేయకుండా జాగ్రత్తలు చెప్పడానికి, మహిళలను చైతన్యపర్చడానికి మంచి అవకాశం కలుగుతుందన్నారు. నిరంతరం గ్రామంలో ఉంటారు కనుక ప్రజలను భాగస్వాములను చేయడం మంచిదన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ తిరుపతిరావు, వై భాస్కరరావు, ఎస్.తిరుపతిరావు, ఉపాధ్యాయులు, అంగన్వాడీ సిబ్బంది, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.